క్లుప్తంగా

పోరాట యోధురాలు ఐలమ్మకు నివాళి

పొన్నూరు: పట్టణంలోని 25వ వార్డు ఇందిరా గిరిజన కాలనీలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్షురాలు రావూరి సుగుణ, పి.లక్ష్మి పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ తెలంగాణలో పేదల కోసం పోరాడిన వీరవనిత చిట్యాల ఐలమ్మ అని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చాకలి ఐలమ్మ ద్వారానే ప్రారంభమైందన్నారు. ఐలమ్మ స్ఫూర్తితో నేటి మహిళలు పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. కార్యక్రమంలో చెంచమ్మ, కోటేశ్వరమ్మ, పోలమ్మ, పద్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఆరు వాటర్ ప్లాంట్లు సీజ్

పెదకాకాని: మినరల్ వాటర్ ప్లాంట్‌లను తనిఖీ చేసి బ్యాక్టీరియాతో ఉన్న వాటిని సీజ్ చేయడం జరిగిందని శుక్రవారం డీఎల్‌పీవో కందిమళ్ల శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని బాజీబాబా దర్గా సమీపంలో ఉన్న వాటర్ ప్లాంట్‌కు శుక్రవారం సీలు వేశారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకుని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వాటర్ నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రమావత్ శ్రీనివాసరావు మట్లాడుతూ పెదకాకాని మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న 40 మినరల్ వాటర్ ప్లాంట్‌ల నుంచి నీటి శాంపిల్స్ సేకరించి పరీక్షలు చేయడం జరిగిందన్నారు. ఈ టెస్ట్‌ల ఆధారంగా మండలంలోని పెదకాకానిలో 2, కొప్పురావూరు 1, నంబూరు 1, వెనిగండ్ల 1, వెంకటకృష్ణాపురం గ్రామంలో 1 మినరల్ వాటర్ ప్లాంట్‌లను సీజ్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ, పెదకాకాని పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సారిక, సిబ్బంది ఉన్నారు.

కుట్టు శిక్షణతో ఆర్థిక భరోసా



మంగళగిరి: కుట్టు శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి పొందుతూ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ పంకజ్ బల్వేరియా తెలిపారు. నీరుకొండలో ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో కురగల్లు గ్రామానికి చెందిన 30 మంది మహిళలకు కుట్టు శిక్షణ పూర్తవ్వగా శుక్రవారం వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ నిర్వాహకులు రమేష్ కన్నన్, వేణుగోపాల్, టీచర్లు ధనకుమారి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను వర్గీకరించాలి

తాడేపల్లి రూరల్: స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను వర్గీకరణ చేయాలని జాతీయ బీసీ చైతన్య సమితి వ్యవస్థాపకుడు బీసీ రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లిలో బీసీ మేధావులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఏపీలో త్వరలో జరిగే స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 50 శాతం పెంచి ఏ,బీ,సీ,డీ,ఈ వర్గీకరణ చేసి బీసీల అందరికీ సమన్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. వర్గీకరణ లేకపోవడంతో జరిగే నష్టాన్ని అన్నిపార్టీల నాయకుల దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగ నాయకులు హనుమంతరావు, గోదావరి జిల్లా నుండి మహేంద్ర, సత్యనారాయణ, మహిళా నాయకురాలు భీమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



తాడేపల్లి రూరల్: గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని తాడేపల్లిలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ దళితులపై దశాబ్దాలుగా కొనసాగుతున్న కులవివక్షను కవిత్వం ద్వారా బహిర్గతం చేసిన మహాకవి గుర్రం జాషువా అని అన్నారు. ఇటీవల హైకోర్టు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి చేసిన కొన్ని వ్యాఖ్యలు సమాజంలో విస్తృత ఆందోళనకు దారితీశాయని, ఈ వ్యాఖ్యలు రాజ్యాంగంలో కల్పించిన సమానత్వ హక్కు (ఆర్టికల్ 14), హింస నుంచి రక్షణ (ఆర్టికల్ 17), సామాజిక న్యాయసూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని భావిస్తున్నామన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బూరుగ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి జొన్నకూటి నవీన్ ప్రకాష్, కోటా బాబూరావు, దర్శనపు విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జగజ్జననికి నీరాజనాలు



ప్రత్తిపాడు శివాలయంలో గజలక్ష్మి అలంకారంలో...



వేణుగోపాలస్వామి ఆలయంలో లలితాదేవిగా...



చేబ్రోలు మండలం మంచాల గ్రామంలో...



చేబ్రోలులోని గంగాపార్వతి సమేత నాగేశ్వర స్వామి దేవాలయంలో...



వెనిగండ్లలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద



వెనిగండ్ల పంచాయతీ కార్యాలయం వద్ద మహాలక్ష్మిగా..



దశావతార వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో...

పత్తిపాడు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు దేదీప్యమానంగా జరుగుతున్నాయి. భక్తులు ప్రత్యేక అవతారాల్లో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివస్తున్నారు. నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని గంగాపార్వతీ సమేత దండేశ్వరాలయంలో పార్వతి అమ్మవారు గజలక్ష్మి దేవి అలంకారంలో, వేణుగోపాలస్వామి, సీతారామస్వామి దేవాలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు లలితాదేవి అలంకారంలో, అద్దంకమ్మతల్లి దేవస్థానంలో అమ్మవారు మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవదాయ శాఖ అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.

చేబ్రోలు మండలంలో...

చేబ్రోలు: చేబ్రోలు మండలంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వివిధ గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చేబ్రోలులో ఖ్యాతి గాంచిన గంగాపార్వతి సమేత నాగేశ్వరస్వామి దేవాలయంలో పార్వతి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా, భీమేశ్వరస్వామి దేవస్థానంలో బాలాత్రిపురసుందరి అమ్మవారు లలితాదేవిగా ప్రత్యేక పూజలు అందుకున్నారు. మండల పరిధిలోని మంచాల గ్రామంలో ఆదిలక్ష్మి కామేశ్వరి అమ్మవారు లలితాపరమేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

పెదకాకాని మండలంలో...

పెదకాకాని: దసరా ఉత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో దేవి శరన్నవరాత్రులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణాలు, ప్రత్యేకంగా అలంకరించిన పందిళ్లలో కనకదుర్గ అమ్మవారి ప్రతిమను ఏర్పాటు చేసి ప్రతి రోజూ విశేష అలంకారాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. వెనిగండ్ల వేణుగోపాల స్వామి ఆలయం వద్ద, వైఎస్సార్ రచ్చబండ వద్ద శుక్రవారం అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించి పూజలు చేశారు. కంతేరు అడ్డరోడ్డులో జాతీయ రహదారి పక్కనే ఉన్న దశావతార వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధాన్యలక్ష్మిగా అలంకరించి పూజలు చేశారు.

పగలు గుట్టలు.. రాత్రి మంటలు



పాత మద్రాసు రోడ్డులో పగలు రోడ్డు వెంబడి గుట్టలుగా పడేసిన వ్యర్థాలు



రాత్రి సమయంలో వ్యర్థాలకు పెట్టిన నిప్పు

ప్రత్తిపాడు: కొందరి నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీతన.. ఎందరో ప్రయాణికుల ప్రాణాలకు ప్రమాదంగా తయారవుతుంది. గుంటూరు–పర్చూరు పాత మద్రాసు రోడ్డులో వట్టిచెరుకూరు మండలం కుర్నూతల సమీపంలో స్పిన్నింగ్, పత్తి మిల్లులు అధికంగా ఉండటంతో వాటి నుంచి ఉత్పన్నమయ్యే వ్యర్థాలను ట్రాక్టర్లు, ఆటోల్లో తీసుకువచ్చి రోడ్డు పక్కన పడేయడం నిత్యకృత్యంగా మారింది. పగలు రోడ్డు పక్కన వ్యర్థాల కుప్పలను గుట్టలు గుట్టలుగా పడేసి, రాత్రి సమయంలో వ్యర్థాలకు నిప్పు పెడుతున్నారు. మంటలు ఆరిపోయిన తరువాత కూడా రోజంతా పెద్ద ఎత్తున పొగ రోడ్డును కమ్మేస్తుంది. దీంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో ఇదే రోడ్డులో ప్రయాణికులు అనేక సందర్భాల్లో పొగ బారిన పడి ప్రమదాలతో మృత్యువు అంచుల వరకు వెళ్లిన పరిస్థితులు అనేకం ఉన్నాయి. అయినప్పటికీ కొందరికి కనువిప్పు కలగక, వ్యర్థాలను అక్కడే పడేసి నిప్పు పెడుతున్నారు. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స్పందించి రోడ్ల వెంట వ్యర్థాలు పడేయకుండా, నిప్పు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



బలసాని కిరణ్ కుమార్‌ని మర్యాద పూర్వకంగా కలిసిన వంగా సీతారామిరెడ్డి



అంబటి మురళీకృష్ణని మర్యాద పూర్వకంగా కలిసిన వంగా సీతారామిరెడి

వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు, పొన్నూరు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు బలసాని, అంబటి

గుంటూరు రూరల్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వలంటీర్ విభాగం జోనల్ ప్రెసిడెంట్‌గా నియమితులైన వంగా సీతారామిరెడ్డి ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బలసాని కిరణ్ కుమార్‌ను, పొన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జి అంబటి మురళీకృష్ణను శుక్రవారం ఇన్‌చార్జిల కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జిలు నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సీతారామిరెడ్డికి శుభాకాంక్షలు తెలపగా, సీతారామిరెడ్డి కృతజ్ఞతాభినందనలు తెలిపారు. అనంతరం ఇన్‌చార్జిలు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యువ ఇంజనీర్లు సాంకేతిక రంగంలో రాణించాలి

కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు తదితరులు

ప్రత్తిపాడు: యువ ఇంజనీర్లు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ విభాగం ఆధ్వర్యంలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు మేక్ స్కిల్ అధినేత పర్వతనేని మధు ఆధ్వర్యంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై ఐదు రోజుల హ్యాకథాన్‌ను నిర్వహించారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మెషిన్ లెర్నింగ్‌పై రెండు రోజులు ఐడియాథాన్, మూడు రోజులు హ్యాకథాన్ జరిగింది. మొత్తం 41 టీమ్‌లు హ్యాకథాన్‌లో పాల్గొని వివిధ రంగాలకు చెందిన పలు వినూత్నమైన ఆవిష్కరణలను రూపొందించి, జ్యూరీ ప్రతినిధులైన మిలట్రోనిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో లోకేష్, డిజైన్ ఇంజనీర్ అండ్ ప్రొడక్ట్ ఎక్స్‌పర్ట్ పి.ప్రవీణ్ కుమార్‌ల ముందు ప్రదర్శించారు. ఐవోటీ బేస్డ్ ఎర్త్ వార్మ్, ఆగ్రో ఐ, హిట్ వెస్ట్ ఫర్ సోల్జర్స్ వంటి ఆవిష్కరణలు సమాజహితంగా ఉన్నాయని జ్యూరీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు హ్యాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. సీఎస్‌ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.రమేష్, ఆయా శాఖల విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెండర్లు, కాంట్రాక్టుల నిర్వహణపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సుకు హాజరైన విద్యార్థులతో బిడ్ అలర్ట్ ప్రముఖులు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ–సెల్, బిడ్ అలర్ట్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు టెండర్లు, కాంట్రాక్టుల నిర్వహణపై శుక్రవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బిడ్ అలర్ట్ ప్రముఖులు జి.విజయ్ కుమార్, జానీమూన్, బి.స్టీవెన్ కుమార్‌లు హాజరయ్యారు. పారిశ్రామిక వేత్తలుగా ఎలా మారాలి అన్న అంశంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. అనంతరం టెండర్లు దక్కించుకునే విధానం, జెమ్ పోర్టల్ ఉపయోగాలు, కాంట్రాక్టుల నిర్వహణ.. వంటి అంశాలను తెలియజేశారు. యువ ఇంజనీర్లు లేవనెత్తిన అనేక ప్రశ్నలు, సందేహాలకు నిపుణులు తమదైన శైలిలో సమాధానాలిస్తూ, పరిష్కార మార్గాలను సూచించారు. సెమినార్‌లో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ కె.హరిబాబు, ఈ–సెల్ కన్వీనర్ డాక్టర్ పూర్ణకిషోర్ పాల్గొన్నారు.

కాలువలు పూడిపోయి పంటలు దెబ్బతింటున్నాయి



ప్రత్తిపాడు: పంట కాలువల్లో పూడిక తీయకపోవడంతో వర్షపు నీటి పారుదల అస్తవ్యస్తంగా తయారై పంట పొలాలు నీట మునుగుతున్నాయని పెదనందిపాడు మండల రైతులు తహసీల్దార్ ఎదుట వాపోయారు. పెదనందిపాడు తహసీల్దార్ హేనాప్రియను శుక్రవారం స్థానిక రైతులు కలిసి తమ గోడును చెప్పుకున్నారు. వేసవిలో కాలవలు పూడిక తీయకపోవడంతో నల్లమడ వాగు నుంచి చిలకలూరిపేట అడ్డరోడ్ వరకు కాలువలు పూడిపోయి దిగువకు నీరు పారే మార్గం లేకుండా పోయిందన్నారు. ఫలితంగా వర్షపు నీరు పంట పొలాల్లోనే రోజుల తరబడి నిలిచిపోయి, పంటలు పూర్తిగా ఉరకెత్తిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రోడ్ల వెంట పడేస్తున్న వ్యర్థాలు కూడా పంట కాలువల్లోకి చేరి కాలువ పూడిపోయేందుకు కారణమవుతున్నాయన్నారు. ఈ మేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. స్పందించిన తహసీల్దార్ హేనాప్రియ నీట నానుతున్న పంట పొలాలను, పూడిపోతున్న కాలువలను పరిశీలించారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం

తెనాలి అర్బన్: ప్రథమ వైద్య చికిత్సపై అందరూ అవగాహన కలిగి ఉండాలని రమేష్ హాస్పటల్ కార్డియాలజీ వైద్యుడు డాక్టర్ వివేక్ వీరాంరెడ్డి పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై శిక్షణ తరగతులను శుక్రవారం నిర్వహించారు. గుండె నొప్పికి చేసే సీపీఆర్ గురించి తెలిపారు.

క్యాన్సర్ వ్యాధిపై అపోహలు వీడండి

గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్

ప్రత్తిపాడు: క్యాన్సర్ వ్యాధిపై అపోహలు వీడాలని గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్ అన్నారు. మండల పరిధిలోని తుమ్మలపాలెంలో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్వస్త్ నారీ, స్వశక్త్ పరివార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మేరి యునిస్ మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్, మరి కొందరికి రక్తపోటు, మధుమేహం, క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి పలు సూచనలు చేశారు. కిశోర బాలికలకు యుక్త వయసులో వచ్చే ఆరోగ్య సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మేరి యునిస్ మాట్లాడుతూ ప్రస్తుతం యువత ఫాస్ట్‌ఫుడ్స్, జంక్‌ఫుడ్స్.. ఇష్టారీతిన తినడం వలన ఊబకాయం బారిన పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో చెల్లమ్మ, పీహెచ్ఎన్ పాల్గొన్నారు.

పుసులూరులో...

పెదనందిపాడు మండలం పుసులూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.నందకుమార్ ఆధ్వర్యంలో స్వస్త్ నారీ, స్వశక్త్ పరివార్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మహిళలు, కిశోర బాలికలకు ఆరోగ్య పరీక్షలు, క్షయ వ్యాధి స్క్రీనింగ్ చేశారు. గర్భిణులు, చిన్నారులకు వేసే టీకాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎండీ జరీనా మాట్లాడుతూ తల్లీబిడ్డలు సరైన పోషకాహారం తీసుకోకుంటే రక్తహీనత ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఎంపీహెచ్ఎస్ జి.శ్రీనివాసరావు, సీహెచ్‌వో కె.లినోరా క్వీనా, ఏఎన్ఎం, సుజాత, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

రాత్రి అయితే చింతలపూడి



లైట్లు పూర్తి స్థాయిలో వెలగక అంధకారంలో ప్రధాన రహదారి

పొన్నూరు: మండలంలోని చింతలపూడి గ్రామంలో వీధి దీపాల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ముఖ్యంగా గ్రామ వీధులతో పాటు ప్రధాన రహదారుల్లో ఎల్‌ఈడీ దీపాల నిర్వహణ అధ్వానంగా తయారైంది. రాత్రయితే వెలగని వీధి దీపాలు, తక్కువ కాంతిలో వెలిగే లైట్లు గ్రామంలో అనేక చోట్ల దర్శనమిస్తున్నాయి. ఫలితంగా ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు రాత్రయితే చీకట్లో ఇబ్బందులు పడాలన్న చింత పట్టుకుంది. బాపట్ల, చీరాలకు వెళ్లే ప్రధాన మార్గంలో పలుచోట్ల ఎల్‌ఈడీ లైట్లు వెలుగుకు నోచుకోవడం లేదు. ప్రధాన మార్గంలో ఏర్పాటు చేసిన వీధి లైట్లు చాలా వరకు మరమ్మతులకు గురై పూర్తి స్థాయిలో వెలగడం లేదు. అంధకారంగా ఉన్న ఆ రోడ్డులో ప్రయాణించేందుకు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారులు కూడా లోతైన గుంతలతో దారుణంగా ఉండడంతో చీకట్లో ఎక్కడ గొయ్యి ఉందో తెలియక భగవంతుడిపై భారం వేసి రాకపోకలు సాగిస్తున్నారు. చీకట్లో గుంతలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వీధి లైట్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మణికంఠ కుటుంబానికి న్యాయం చేయాలి



ఏఎన్‌యూ ప్రధాన ద్వారం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

పెదకాకాని(ఏఎన్‌యూ): అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు శివ అధ్యక్షతన మణికంఠ కుటుంబానికి న్యాయం చేయాలని, ఆంధ్రా విశ్వవిద్యాలయ వీసీ రాజీనామా చేయాలని, వర్సిటీలో మెడికల్ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ముందుగా వర్సిటీ ప్రధాన ద్వారం వరకూ శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా కార్యదర్శి యశ్వంత్ పాల్గొని మాట్లాడుతూ ముఖ్యంగా ఏయూలో బీఈడీ 2వ సంవత్సరం చదువుతున్న మణికంఠ ఫిట్స్ వచ్చిగుండెపోటుతో చనిపోవడం జరిగిందని, కేవలం వర్సిటీలో వైద్య వసతులు లేకపోవడం వలన మణికంఠ అనే విద్యార్థికి సరైన సమయంలో ఆక్సిజన్ పెట్టలేని పరిస్థితి నెలకొందని, ఇది కేవలం ఏయూ వీసీ నిర్లక్ష్యమేనన్నారు. గతంలో పలుమార్లు ఏఐఎస్ఎఫ్ ఏయూ వీసీకి ఆక్సిజన్లు పెట్టించండని చెప్పినా కాలయాపన చేశారని ఆరోపించారు. విద్యార్థి మణికంఠ మరణం కేవలం వీసీ నిర్లక్ష్య వైఖరి వల్లే జరిగిందని చెప్పి విద్యార్థి సంఘాలు మండిపడ్డాయి. ఏఎన్‌యూ ఇన్‌చార్జి పాలెం నాసరయ్య మాట్లాడుతూ వైద్య సదుపాయాలు లేనందు వలన ఆంధ్ర యూనివర్సిటీ బీఈడీ విద్యార్థి మణికంఠ మృతి ఎంతగానో బాధించిందని వాపోయారు. అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి నారా లోకేష్ వీసీకి మద్దతిస్తూ విద్యార్థి సంఘాలపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మణికంఠ కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి అమర్నాథ్, ఏఎన్‌యూ అధ్యక్ష, కార్యదర్శులు అర్జున్, అఖిల్, వెంకీ నాయక్, హెమ్రీ, డేవిడ్, శ్రీకాంత్, బాబి, వెంకట కోటయ్య, సాగర్, చందు, ప్రతాప్, సతీష్, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

వరదల వేళ అప్రమత్తత అవసరం

కొల్లిపర: ఎగువ ప్రాంతాల్లో అధిక వర్షాలు కురుస్తున్న కారణంగా రానున్న రెండు రోజుల్లో కృష్ణానదికి వరద పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు వరదల సమయంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. మండలంలోని బొమ్మువానిపాలెం, అన్నవరపులంక గ్రామాల్లో తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహాతో కలసి కలెక్టర్ శుక్రవారం పర్యటించారు. గ్రామంలోని రైతులతో మాట్లాడారు. వారి సమస్యలపై ఆరా తీశారు. నదిలో వరద నీరు ఎంత మేరకు వస్తే ప్రమాదం, ఎన్ని లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తే పంటలకు, గ్రామానికి నష్టం జరుగుతుందన్న అంశాలను అధికారులను, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నది పరీవాహక ప్రాంతాల్లో రైతులు ఏ పంటలు పండిస్తున్నారని ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... కృష్ణానదికి వరద పెరిగే అవకాశాలు ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. మండల అధికారులు ప్రజలకు సమాచారం అందించినప్పుడు పునరావాస కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వరద పూర్తిగా తగ్గే వరకు అధికారులు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు రాజేష్, ఎంపీడీవో విజయలక్ష్మి, ఆర్ఐ వంశీకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.